
**వాచ్‌మన్స్ కాపలాదారులే కాని సెంటిమెంటల్ ఫూల్స్ కారాదు. కొమ్మలతో స్నేహం కంటె బొమ్మలతో స్నేహం ప్రాణాంతకం అవుతుంది.**



# ప్రేయసి

మాచిరాజు సావిత్రి

పొద్దున తొమ్మిది గంటలైంది. వెంకటేశం గబగబా లోపలికి వచ్చి ఆత్రంగా చూశాడు. "అమ్మయ్య! అక్కడే ఉంది!" అని తృప్తిగా నిట్టూర్చాడు. "నా పిచ్చిగాని ఎక్కడికి వెళుంది?" అని నవ్వుకున్నాడు. నెమ్మదిగా ఆమె దగ్గరికి వెళ్ళి ఆప్యాయంగా చేత్తో నిమిరాడు. "బావున్నావా రాణీ!" అని మెల్లగా, మృదువుగా, రహస్యం చెప్తున్నట్టు అడిగాడు. ఇంతలోనే ఎవరో రావడం గమనించి. గబుక్కున ఆమె మీద నుంచి చెయ్యి తీసేసి కొంచెం దూరంగా నుంచున్నాడు.

ఆ వచ్చింది అతని సూపర్వైజరు. "ఏమోయ్! వెంకటేశం! మళ్ళీ పెందరాడే వచ్చావే!" అని పలకరింపుగా అని వెళ్ళిపోయాడు.

"పెందరాళే రావడం నాకిష్టమండీ." అని జవాబిచ్చాడు వెంకటేశం. అది వినడానికి అతను అక్కడలేడని గమనించి మళ్ళీ ఆమె దగ్గరకు చేరాడు. ఆమె వేపు కొంటెగా చూశాడు "విన్నావా ఆయనేమన్నారో? నిన్ను చూడడంకోసం ఎంత పెందరాడే వస్తే తనవి తీరుతుంది? అసలు నిన్ను వదిలి వెళ్ళకుండా ఉంటే బావుంటుంది! కానీ అది వీలుపడదుగా!" అని నిట్టూరుస్తూ, విచారంగా అయిపోయాడు. ఆమె అతని వేపు ఓదార్పుగా చూసి, జాలిగా నవ్వింది. అతని విచారం చేత్తో తీసేసినట్టు మాయమయింది. "అవును! నీతో ఈ కాస్సేపు ఉండగలగడమే నాకు మహాభాగ్యం! అది నాకూ తెలుసుననుకో! కానీ ఎప్పుడూ ఇంకా ఇంకా కావాలని లేనివాటి కోసం ఆశపడడం మనుషులకు సహజమే కదా! అందుకే అలా అంటాను. నువ్వది పట్టించుకోకు" అని ఆమెకి నచ్చజెప్పి ఉత్సాహంగా కాలరు సర్దుకునినుంచున్నాడు.

ఇంతలో అతని తోటి ఉద్యోగస్థులు కూడా రావడం ప్రారంభించారు. ఒకళ్ళనొకళ్ళు పలకరించుకుంటూ, ఎవరి స్థానాలకు వాళ్ళు వెళుతున్నారు.

"ఏమోయ్ వెంకటేశం! అప్పుడే వచ్చేశావే!" అని అతన్నికూడా పలుకరించారు. రాణీ గురించిన ఆలోచనలతో తన్మయుడైన అతనికి వినిపించలేదు అతని పరధ్యానం చూసి మిగిలినవాళ్ళు ముసిముసిగా నవ్వుకున్నారు.

క్రమంగా జన ప్రవాహం ఎక్కువైంది. ఆ వచ్చిన వాళ్ళంతా రాణి వేపే చూస్తున్నారు గాని, పక్కనేవున్న వెంకటేశం ఒక్కరి దృష్టికికూడా ఆనలేదు. అప్పుడప్పుడు వాళ్ళు మాట్లాడుకునే మాటలు అతనికి వినిపిస్తున్నాయి. అతని వునికే గుర్తించని వాళ్ళకి అతను వింటాడేమోనన్న సంకోచం ఎందుకుంటుంది?

"అబ్బ: ఎంత బావుందో!"

"చాలా అందంగా వున్నది!"

"అద్భుతం!"

ఇలాంటి మాటలు విన్నప్పుడల్లా వెంకటేశానికి చాలా కష్టంగా వుంటుంది. కానీ ఎవర్నీ ఏమీ అనలేకపోయాడు. ఆ ప్రశంసల పరంపర రోజల్లా సాగుతూనే వున్నది.

ఎలాగో సాయంకాల మైంది. వెంకటేశం సహోద్యోగులు సంతోషంగా ఇళ్ళకు వెళ్ళే సన్నాహంలో వున్నారు. వెంకటేశం మాత్రం వాళ్ళ ఉత్సాహంలో పాలు పంచుకోలేకపోయాడు. "ఇంటికి వెళ్ళడంలో ఆనందం ఏముంది? ఇంటికి వెళ్ళాలంటే రాణిని విడిచి వెళ్ళాలి. మళ్ళీ రేప్పొద్దుటిదాకా చూసేందుకు వీలుండదు. నా జీవితంలో ఈ కొద్దిపాటి ఆనందానికి మళ్ళీ వాయిదా వెయ్యాలి." అని చింతిస్తున్నాడతను.

"వెంకటేశం! ఇంకా బయల్దేరలేదూ?" అన్నారెవరో.

అతను తెప్పరిల్లి, "ఇదుగో, ఇప్పుడే!" అంటూ వెళ్ళడానికి హడావుడిపడుతున్న వాడిలా అభినయించాడు.

ఇంకొకరు ఫక్కున నవ్వారు "అతనికేం తొందరయ్యా! ఇంటికెళ్ళాలో అని కొట్టుకునేందుకు అతనికేమైనా పెళ్ళామా, సంసారమా! తొందరగా వెళ్లాలి. కొట్టు మూసే లోగా చేరాలి. కూరలు కొనాలి. బిడ్డకు మందు తేవాలి అనే బాధ్యతలేమీ లేవు. అయ్యో, ఆలస్యంగా వెళితే ఇంటావిడకు కోపం వస్తుందే, అనే భయం లేదు. ఇష్టమొచ్చినప్పుడు తిరుగుతాడు. బ్రహ్మచారి అయిఉండడంలో అదే హాయి!" అసూయ కలిసిన వెటకారంతో వ్యాఖ్యానించాడు.

వెంకటేశం ఏమీ జవాబివ్వకుండా ముఖం తిప్పేసుకున్నాడు. "హాయిట, హాయి! ఎదురుచూసే వాళ్ళెవరూ లేని ఆ ఒంటరితనంలో ఏపాటి హాయి ఉంటుంది? తల్లీ, తండ్రీ, భార్యాబిడ్డలు, తోబుట్టువులు, ఏమి బాధ్యతలూ లేని ఆ స్వేచ్ఛలో ఏమానందం? అందుకే అంటారు "పొరుగింటి పుల్లకూర" అని అనుకున్నాడు.

ఇంటికి వెళ్ళే దోవలో కూడా వెంకటేశాన్ని ఆ ఆలోచనలు వదల్లేదు. తనెంత పాపం చేసుకున్నాడోగాని, నా అనే వాళ్ళు ఒక్కరు మిగల్లేదు. తనింకా కడుపులో వుండగానే తండ్రి పోయాడు. తల్లి పురిటిలోనే పోయింది. ఇంక తోబుట్టువుల ప్రసక్తే లేదు. చేరదీసి, పెంచి, పెద్దచేసిన వాళ్ళుకూడా తనకి కాస్త వయసు రావడంతో "ఇక మా పని అయిపోయింది" అన్నట్టు కన్ను మూశారు. ధన లేమితో బాటు అనురాగ లేమి కూడా అనుభవించమని శపించి మరీ వెళ్ళారు. "నా అంత దురదృష్టవంతుడు ఇంకొకడు వుండడు" అనుకున్నాడతను.

అంతలోనే రాణి "నేనున్నాను"అంటూ జ్ఞాపకం వచ్చింది. అతని ముఖంలో చిరునవ్వు వెలిసింది. "ఛ! ఛ! రాణి వుండగా నేను దురదృష్టవంతుణ్ణెలా అవుతాను?" అనుకున్నాడు. తను ఏం పాపం చేసుకుని తన వాళ్ళందరినీ కోల్పోయాడో అనుకునే కంటే తను ఎంత పుణ్యం చేసుకోవడం వల్ల రాణిని కలుసుకునే అవకాశం లభించిందో అనుకోవడంలోనే అతనికి ఎక్కువ ఆశ్చర్యం కలుగుతుంది.

తనని పెంచిన వాళ్ళనికూడా పోగొట్టుకున్న తర్వాత బ్రతుకు తెరువుకోసం ఊరి మీద పడ్డాడు. చదువూ, డబ్బూ, సిఫార్సులూ లేనివాడికి దొరికే ఉద్యోగం కోసం అన్వేషించ సాగాడు. ఆ అన్వేషణ అంతు లేనిది అనుకుంటున్న సమయంలో అతనికి ఇప్పుడు చేస్తున్న ఉద్యోగం దొరికింది. అక్కడే రాణి పరిచయ భాగ్యం కలిగింది. అదృష్టం పండింది. జీవితం ధన్యమైంది.

మర్నాడు పొద్దున మళ్ళీ రాణిని చూసేంతదాకా రాత్రి మొదలయిన అతని హృదయావేదన తగ్గలేదు. ప్రతిరోజూ తప్పనిసరయిన ఈ విరహం మరీ దుర్భరమనిపించింది. దాన్ని తప్పించే విధానమేమిటా అని తీవ్రంగా ఆలోచించ సాగారు రోజూ కంటే కూడా ఎక్కువ పరధ్యానంగా ఉండడం గమనించిన తోటి వాళ్ళు చిన్న చిన్న విసుర్లు వేయడం మొదలుపెట్టారు. అతను వాటిని కూడా గమనించే స్థితిలోలేడు. రోజల్లా ఆలోచించిన తర్వాత అతనికేదో తట్టినట్టైంది.

సాయంకాలమవగానే సూపర్వైజరు దగ్గరకి వెళ్ళి, "నేను రాత్రిళ్ళుకూడా ఇక్కడే ఉండడానికి వీలుంటుందా సార్?" అనడిగాడు.

ఆయనకా "కూడా" అన్నమాట వినిపించినట్టులేదు. అర్థమవనట్టు అతనివేపు చూస్తూ, "అంటే? నైట్ వాచ్‌మన్‌గా ఉండాలనా నీ ఉద్దేశం?" అనడిగాడు.

ప్రముఖ ప్రచురణల సంస్థ
యం. శేషాచలం అండ్ కంపెనీ
వారు
సాహితీ ప్రియులకు
నెలనెలా అందించే
కానుక
పుస్తక ప్రపంచం
మాస పత్రిక
1/8 డెమ్మీ సైజు 64 పేజీలు
వెల: 1 రూపాయి
తొలి సంచిక: మే '78
ఇందులో
వాసిరెడ్డి సీతాదేవి
సీరియల్ నవల
బొమ్మరిల్లు
ఇంకా
తెలుగు సాహిత్యానికి గౌరవం
తెచ్చిన వివిధ రచయితల కథలు,
కవితలు, కార్టూన్లు, సాహితీ
వ్యాసాలు కాక మరెన్నో శీర్షికలతో!
వివరాలకు
ఆంధ్రప్రదేశ్
బుక్ డిస్ట్రిబ్యూటర్స్
రాష్ట్రపతిరోడ్ - సికింద్రాబాద్-3

"మీరు కావాలంటే అదీ చేస్తానండి." అన్నాడు వెంకటేశం వినయంగా.

"సరె నీ ఇష్టం. అయితే పగలు ఎప్పుడు మానేస్తావు?"

అదిరిపడ్డాడు వెంకటేశం. "మానేయడమా? అంటే పగలు రావద్దనా మీరంటున్నది?" అని వణికే గొంతుతో ప్రశ్నించాడు.

"మరి? రాత్రీ పగలూ కూడా పని చేస్తావేమిటి? నీకేం తిండీ నిద్రా అక్కర్లేదా?" అంటూ నవ్వారాయన.

వెంకటేశం అవాక్కయి నుంచుండిపోయాడు. పగలు రానేరాకూడదా? అంటే రాణిని చూసేందుకు వీలుండదు! అమ్మో! ఆమెని చూడకుండా ఒక్కరోజైనా తను ఉండగలడా? ఆమె సాన్నిధ్యంలో ఉండే కాలం ఎక్కువచేసే ప్రయత్నంలో అసలు మొదటికే మోసం వచ్చేటట్టున్నది! ఎలాగో గొంతు పెగల్చుకుని అన్నాడు "పోనీ వద్దులెండి సార్. ఇప్పటిలాగానే వుంటాను."

ఆయన నవ్వుకుని "సరే నీ ఇష్టం" అని ఊరుకున్నారు.

మర్నాడు వెంకటేశం చాలా నిరుత్సాహంగా వున్నాడు. క్షణ క్షణానికీ రాణి వేపు చూస్తున్నాడు. అతనికి తెలిసినంతవరకూ తన ప్రవర్తనలో తేడా ఏమీ లేదుగానీ, మిగిలిన వాళ్ళకి ఏదో కనిపించినట్టుంది. ఎలా పసిగట్టారోగాని, ఒకళ్ళిద్దరు అతనికి రాణిపై వుండే అభిమానాన్ని కూడా గ్రహించారు. అతన్ని హాస్యం చేసేందుకు వాళ్ళకి ఇంకో కారణం దొరికింది.

రాత్రి కూడా రాణికి దగ్గరగా గడపాలనే పథకం బెడిసికొట్టడంతో వెంకటేశం పగలు ఇంకా పెందరాడే రావడం అలవాటు చేసుకున్నాడు. సూర్యోదయంతోనే వచ్చేసి గేటు తెరిచేదాకా వాచ్‌మన్‌తో కాలం గడపడం పరిపాటైంది. అయితే ఈ విషయం పై అధికార్ల చే గమనింపబడ్డదని అతనికి తెలీదు.

రోజులు గడుస్తున్నకొద్దీ అతనికి రాణిపై వున్న ఇష్టం మిగిలిన అందరికీ ఒక కాలక్షేపం అయిపోయింది.

"ఏమోయ్! ఈ మధ్య చాలా హుషారుగా వుంటున్నావ్! ఏమిటి కథ?" అని ప్రశ్నించి.

"హుషారెందుకుండదోయ్ అంత అదృష్టం కలిసొచ్చిన తరువాత?" అని గుంభనగా జవాబిచ్చి నవ్వుకునేవాళ్ళు కొందరయితే.

"ఏమోయ్! నువ్వీవాళ సినిమాకి వెళ్ళాలంటే మీ ఆవిడ ఒప్పుకుంటుందిటోయ్?" అని ముఖం మీద వెక్కిరించేవాళ్ళు మరి కొందరయ్యారు.

ఇల్లాంటివి విని కోపం వచ్చినా, ఏమీ మాట్లాడకుండా ఊరుకునేవాడు వెంకటేశం.

ఆ రోజు మిగిలిన రోజులకన్నా వ్యత్యాసంగా వుంటుందని వెంకటేశానికి ముందు సూచనలేమీ కనబడలేదు. మామూలుగానే ఆరోజు కూడా తెల్లవారుతూనే వచ్చేసి వాచ్‌మన్‌తో మాట్లాడడం మొదలుపెట్టాడు. కానీ ఆ రోజు వాచ్‌మన్ మామూలులాగా వెంకటేశంతో కబుర్లు చెప్పలేదు. అతను అలా రావడం యిష్టంలేనట్టు మొహం చిట్లించుకుని అటు తిరగబోయాడు. కానీ వెంకటేశం గమనించకుండా అతనితో ఎప్పటిలాగే తన ధోరణిలో తను చెప్పుకుపోతున్నాడు. ఎవరితోనైనా రాణిని గురించి చెప్పుకోవాలని వెంకటేశానికి ఒక తపన వుంది. కానీ ఎవ్వరితోనూ చెప్పనివ్వని





వివేకవంతులకు మానసిక వ్యాయామం

ఎంట్రీ ఫీజు లేదు

మీరు తప్పక ఒక బహుమతి గెలుపొందగలరు.
సుమారు 1000 బహుమతులు పంచిపెట్టబడును.

(1) కొత్త మోడలు రాజ్‌దూత్ మోటార్ సైకిల్ లేక బెలిషిజన్. 2 వ బహుమతి (2) గ్యారంటీడ్ ఎక్కువ మీడియం వరల్డు సౌండ్ మార్షల్ ట్రాన్సిస్టర్ ధర రు 260/- మాత్రమే. 3వ బహుమతి (3) అఖిల భారత హెవీ డ్యూటీ ట్రాన్సిస్టర్ ధర రు. 185/- బహుమతులు సగం ధరపై ఇవ్వబడును. ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది.

ఉదాహరణకు
మొత్తం 24

| | | |
|---|---|---|
| 5 | 10 | 9 |
| 12 | 8 | 4 |
| 7 | 6 | 11 |

ఖాళీలలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడి నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటు కూడినా మొత్తం 30 వచ్చునట్లు నింపండి. బహుమతి గెలిచినవారు పోస్టేజి. ప్యాకింగ్ & లైసెన్సు ఫీజు చెల్లించాలి. ఫలితం కొరకు ఖాళీ కవరుతో ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో పంపండి.

| | | |
|---|---|---|
| | 12 | |
| | 10 | |
| | 8 | |

ఆఖరు తేదీ: 30-5-78.

WILFORD WIRELESS INDIA (A 2)
Gandhi Nagar, Delhi-31

బిడియం కూడా వున్నది. అతనిలో రాణికి దగ్గరగా వుండాలనే ఒక తహతహ ఉన్నది కాని. అలా వుండనివ్వని అధికారులు కూడా వున్నారు. అందుకే రాణికి పూర్తిగా దగ్గర కానంత దూరంలో ఆమెను గురించి తప్ప మిగతా అన్ని విషయాలను గురించీ మాట్లాడుతున్నాడు. కానీ ఈ తహతహ గురించీ. ఈ తపన గురించీ తెలియని వాచ్‌మన్ విసుక్కుంటున్నాడు. ఎలాగో గేటు తెరిచే వేళయింది. బ్రతుకు జీవుడా అనుకుంటూ వాచ్‌మన్ వెంకటేశం బెడదను వదిలించుకున్నాడు.

లోపలికి వెళ్ళాక వెంకటేశం మామూలుగానే ఎవ్వరి వేళాకోళాలు పట్టించుకోకుండా తన స్థానానికి వెళ్ళిపోయాడు.

ఎప్పటిలాగే చుట్టూ తిరిగే మనుషులు ఆమెగురించి అనే మాటలను ఎప్పటికప్పుడు దులిపేసుకుంటున్నాడు. లేకపోతే అతని హృదయం భీష్ముని శరీరంలా తయారవుతుంది ఇంతలో ఎవరో ముగ్గురు కొత్త వాళ్ళు వచ్చి రాణిని పరికించి చూస్తున్నారు.

"అబ్బ! ఎంత బావుందో!" అన్నారొకరు.

"ఇంతందం నేనెప్పుడూ చూడలేదు" అన్నాడు రెండోవాడు

ఇద్దరూ కలిసి మూడోవాడివేపు చూశారు. అతను చప్పరించేసి. 'ఆ! ఇదీ ఓ అందమే ఇంతకన్న బాగున్న వాళ్ళను సవాలక్ష మందిని చూశాను!' అనేశాడు.

రాణి ఉలిక్కిపడట్టు కనిపించింది వెంకటేశానికి. ఆమెకు తన అందమంటే అంత గర్వమని అతనికి అంతదాకా తెలియదు.

"అదేమిటి అలా అంటావు?" అని మిగిలిన ఇద్దరూ అతన్ని కోప్పడుతున్నారు కానీ అతను వెనుకాడలేదు.

"జాగ్రత్తగా చూడండి. ఆ కళ్ళు అలాగేనా వుండాల్సింది? వంకర టింకరగా! ఆ ముక్కు చూడండి. ఎంత లావుగా వున్నదో! ఆ బుగ్గలు? వాటిలో నునుపు ఎక్కడైనా వుందా? ఆ మెడ చూడండి!."

అని ఒక్కొక్క అవయవాన్నీ పేరు పేరునా దుయ్యబడుతుంటే వెంకటేశానికి చెప్పలేనంత ఆగ్రహావేశాలు ముంచుకొచ్చాయి. తన రాణిని అన్ని మాటలనే హక్కు వీళ్ళ కెవరిచ్చారు? అంత అహంకారమా? ఎదుటి మనిషిని నొప్పిస్తున్నామేమోనన్న ఆలోచన కూడా లేకుండా ఏమిటా వాగుడు! వాళ్ళని ముగ్గుర్నీ కలిపి చావకొట్టాలనిపించింది వెంకటేశానికి. అప్పుడు అతను చూపిన నిగ్రహం మహర్షులకే తప్ప రాజర్షులకి కూడా సాధ్యపడదు.

ఎట్టకేలకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఎరుపెక్కిన కళ్ళతో రాణి వేపు చూశాడు వెంకటేశం. ఆమె బాధగా తల దించుకున్నట్టున్నది. అవమాన భారం ముఖంలో స్పష్టంగా కన్పించింది వెంకటేశానికి. ఇంక అతను ఊరుకోలేకపోయాడు. ఆమె దగ్గరగా జేరి.

"రాణీ! ఇంక లాభంలేదు! ఎంతో ఘరానాగా ఉండాల్సిన నువ్వు ఇలా బజారు మనిషిలాగా నలుగురి నోళ్ళలోనూ పడడం నేనిక చూస్తూ ఊరుకోలేను ఇవాళ రాత్రే నిన్ను నాతో తీసుకెళ్తాను. ఈ ఉద్యోగం పోతే పోనీ! నువ్వుంటే నాకింకేమీ అక్ఖర్లేదు!....", అని చెప్తున్నవాడు. "ఏమిటా గుసగుసలు?!...." అని సూపర్వైజరు గద్దించడంతో గబుక్కున ఆపేశాడు.

"వెంకటేశం! ఏం చేస్తున్నావు నువ్వ

[26వ పేజి చూడండి]




ఏడ్పు నుండి ఉల్లాసానికి

పెరిగే పాపలకు అజీర్ణం చేయడమనేది సహజం మీపాపను అజీర్ణంనుండి ఉపశమనాన్ని కల్గించి ఉల్లాసంగా ఉంచేందుకు బయో - సాల్‌ను నమ్మండి. ఇంకేమాత్రం ఏడ్పువుండదు. బయో - సాల్‌కు కృతజ్ఞతలు చెప్పండి.

బయో-సాల్®

గ్రైప్ - మిక్చర్

మీ పాపలను సంతోషంగా మరియు ఉల్లాసంగా నుంచుతుంది.

జె. & జె. డిషేన్
ల్యాబొరేటరీస్ (ప్రై.) లిమిటెడ్
హైదరాబాద్. ఇండియా

# ప్రేయసి

(23వ పేజీ తరువాయి)

క్కడ?" అని ఆయన కొంచెం అనుమానంగానే చూస్తూ అడిగాడు.

"ఏం లేదండి", అని వెంకటేశం గొంతు తగ్గించి, గబగబా, "రాత్రి పదకొండింటికి వస్తాను. గుర్తుంచుకో." అనేసి దూరంగా జరిగాడు.

సూపర్వైజరు ఇంకా అతనివేపూ, రాణి వేపూ, చూస్తూ ఏదో తీవ్రాలోచనలో పడ్డాడు.

* * *

అన్నట్టే సరిగ్గా రాత్రి పదకొండింటికి వచ్చాడు వెంకటేశం. ఇన్నాళ్ళూ వాచ్‌మన్‌తో చెప్పిన కబుర్లు ఇవ్వాళ లాభించాయి. వాచ్‌మన్‌కి తెలియకుండా ఎప్పుడు, ఎక్కడ, ఎలా లోపలికి వెళ్ళాలో వివరంగా తెలుసు కాబట్టి, ఏమీ కాకుండానే




గేటు దాటి వచ్చేశాడు వెంకటేశం. ఆ తర్వాత ఇంక లోపలికి వెళ్ళడం ఎంతసేపు! తొందరగా రాణి వున్న గదిలోకి వెళ్ళిపోయి "రాణీ! వచ్చేశాను!" అన్నాడు. చీకటిలో రాణి కళ్ళు కృతజ్ఞతతో మెరవడం గమనించాడతను. అతని గుండె కరిగిపోయింది. "ఇంకెంతోసేపు లేదు" అని ఆమెని బుజ్జగిస్తూ చేతుల్లోకి తీసుకున్నాడు.

హఠాత్తుగా లైట్లు వెలిగాయి. "అదుగో! పట్టుకోండి!" అని రకరకాల గొంతులు ఒక్కసారిగా అరిచాయి.

లైట్ల మిరుమిట్లతో ఒక్క క్షణం చూపు ఆనని వెంకటేశానికి మళ్ళీ పరిసరాలు కనిపించ సాగాయి. ఎదురుగా సూపర్వైజరు, వాచ్‌మనూ, ఇంకా ముగ్గురు, నలుగురూ.

ఒళ్ళు చెమటలు కారుతూంటే, అన్నింటికీ తెగించి, రాణిని గట్టిగా చేతులతో బిగించి, తలుపువైపు పరుగు ప్రారంభించాడు వెంకటేశం. అతన్ని తరుముకుంటూ మిగతావాళ్ళు వచ్చారు. ఆ వేట ఎంతో కాలం సాగలేదు. రెండు నిముషాలలో అతన్ని పట్టుకుని, రాణిని అతని చేతుల్లోంచి విడిపించి, అతను పారిపోవడానికి వీల్లేకుండా నేలమీద నొక్కిపట్టి వుంచారు.

సూపర్వైజరు కోపం పట్టలేక అతన్ని తన్నాడు. "వెధవా! నమ్మి ఉద్యోగం ఇప్పించినందుకు ఇదా నీ కృతజ్ఞత! నీకీ మ్యూజియంలో పని ఇప్పించింది నేను కాదుట్రా! నాకే ద్రోహం తలపెడతావా! వాటికి కావలాదారుగా వున్నంత మాత్రాన ఇక్కడి పెయింటింగ్స్ అన్నీ నీవే ననుకున్నావేమిటి? దొంగ రాస్కెల్!" అంటూ మళ్ళీ తన్నాడు.

ఉచితము! ఉచితము!

## తెల్ల మచ్చలు


అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

వివరాలు:

BHARAT AYURVEDASHRAM (M)
Post Katri Sarai (Gaya)

## మూలశంకకు

త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
— శస్త్రచికిత్స
అవసరములేదు!




ఆ తాపులు వెంకటేశానికి తగిలినట్టే లేదు. ఆవేశంగా అన్నాడు. "నాకన్నీ ఏం అఖ్ఖరేదు! రాణిని మాత్రం నాతో తీసుకువెళ్ళేందుకు వచ్చాను!"

"అవునవును! నీ కళ్ళు ఆ మొగలు రాణి బొమ్మమీద కాక. ఇంక దేని మీద పడతాయి! దాన్ని ఏ మ్యూజియం వాళ్ళకి అమ్మినా వేలకి వేలు వస్తాయని తెలియదూ? దొంగ కబుర్లు చెప్పకు!" అని విసుక్కున్నాడు సూపర్వైజరు.

వెంకటేశానికి చెవుల్లో సీసం పోసినట్టు అనిపించింది. "నేను రాణిని అమ్ముకుంటానా!? ఎంతబద్ధం! మీరే తనకి పరువు తీసేసి బజార్లో నిలబెట్టారు!"

"ఎవడో వెధవ గీసి పడేసిన బొమ్మకి పరువేమిట్రా నీ పిండాకూడు!" అని ఎవరో అంటున్నారు.

"వీడికి పిచ్చిగాని ఎక్కలేదుగదా!" అని మధనపడుతున్నాడు సూపర్వైజరు.

"అసలు నేనెప్పుడో అనుకున్నానండి! ఎందుకు అంత తెల్లవారే వచ్చి నాతో బాతాఖానీ కొడ్తున్నాడూ అని! ఇదన్నమాట ప్లాను!" అంటూ తన ప్రయోజకత్వం నిరూపించుకోబోయాడు వాచ్‌మన్.

"అవును. నువ్వు హెచ్చరికగా ఉండడం మంచిదయింది. నాకే అనుమానమొచ్చిం దివ్వాళ! ఎంతసేపూ దానికేసే చూడడం, దాన్ని పట్టుకు వేళ్ళాడడం! దానితో కబుర్లు కూడా చెప్పడం! ఒకవేళ దీన్ని పట్టుకుపోవాలనుకుంటున్నాడో ఏమిటో అనిపించింది. ఇంకా నయం! పిచ్చి ఊహ అని కొట్టి పారేయక ఇలా వచ్చినందుకు ఫలితం దక్కింది!" అంటూ తనని తానే అభినందించుకున్నాడు సూపర్వైజరు.

రాణిని అలా పదేపదే "అది. దాన్ని" అంటూ సంబోధించడం వినలేకపోతున్నాడు వెంకటేశం. రాణి ఎంత బాధపడుతున్నదో ఏమిటోనని ఆమెవైపు చూడబోతే వీలుపడలేదు

"ఇంక వీణ్ణిక్కడనుంచి తీసుకెళ్ళండి" అన్నాడు సూపర్వైజరు. వెంకటేశం. గొల్లుమన్నాడు.

"రాణీ! నన్ను లాక్కెళ్ళిపోతున్నారు రాణీ! నిన్ను విడిచి వెళ్ళాల్సొస్తోంది! మళ్ళీ నీ కోసం వస్తాను. బెంగ పెట్టుకోకు!" అంటూ ఆక్రోశించాడు.

చిత్తరువులోని రాణి బెంగపెట్టుకోలేదు సరికదా నవ్వుతోంది.

"రాణీ! ఇలా చూడు రాణీ! నే వెళ్ళేలోపల ఒక్కసారి నా వేపు చూడు!" అంటూ ఆక్రందించాడు వెంకటేశం.

రాణి నిర్లక్ష్యంగా నవ్వింది. ఇంతవరకూ ముక్కూ. మొహం ఎరగని ఒక పరాయి మొగవాడి చేతుల్లో సిగ్గు లేకుండా కులుకుతూ. అతనివేపు చిలిపిగా, వలపుగా, సమ్మోహనంగా నవ్వింది.

వెంకటేశానికి ఏదో అర్థమయి నట్టుంది. "ఇక ఆ పటాన్నికూడా లోపలికి తీసుకెళ్ళి పెట్టండి." అని ఆదేశిస్తున్న సూపర్వైజరుకి అడ్డొచ్చి. ఆవేశంతో కేకలేశాడు.

"రాణీ! నన్నిలా మోసం చేస్తావా? అందుకే ఆడదాన్ని నమ్మకూడదన్నారు! ఒరేయ్! నిన్ను కూడా బుట్టలో వేసుకుని చివరకు ఓ రోజు దగా చేసి వెళ్ళిపోతుందిరోయ్! జాగ్రత్త! దాని వలలో పడకు!" అంటూ కొత్త కాపలాదారుకు హితోపదేశం చేశాడు.

"వీడికి నిజంగానే పిచ్చెక్కింది! ఊఁ! తీసుకెళ్ళండి!" అని సూపర్వైజరు అనగానే వెంకటేశం కనుమరుగయ్యాడు.

రాణి సరికొత్త ఆరాధకుడితో నిష్క్రమించింది.

★


నారీ లోకానికి

ఆంధ్రజ్యోతి

సమర్పించు అపూర్వ కానుక

మీ ఇంటికి జ్యోతి

'వనితా జ్యోతి'

మహిళల సచిత్ర మాసపత్రిక

కన్నుల పండువైన ఆఫ్‌సెట్ ముద్రణతో రంగుల స్వప్నంలా శ్రీబాపూ చిత్రాలంకరణతో జూన్ '78 సంచిక 1/4 డెమ్మీ సైజులో 64 పేజీలతో వెల-రెండురూపాయలకు 'మే' నెలలో మీ కరకమలాలను అలంకరించబోతున్నది.

అనేకానేక సమస్యలతో సతమతమవుతున్న నేటి వనితామణులు- ఒక ఉత్తరం ద్వారా. చిన్న వ్యాసం ద్వారా, ఒక కొత్త అల్లిక. వంట, కుట్టు వ్రాసి పంపడం ద్వారా-వనితాజ్యోతిని తీర్చిదిద్దడంలో పాలు పంచుకోవచ్చు.

కళాశాల విద్యార్థినులు, లెక్చరర్లు, మహిళా సమాజ సభ్యులు. ఉద్యోగినులు తమ తమ వృత్తి సమస్యలను. వ్యక్తిగత సమస్యలను వనితాజ్యోతికి వ్రాసి పంపవలసిందిగా కోరుతున్నాము.

కథలు. వ్యాసాలు, కవితలు, స్త్రీల జీవితానికి సంబంధించిన ఏ ముఖ్య అంశంపైనైనా వ్రాసిన స్కెచెస్ "వనితాజ్యోతి"లో ప్రచురణకు పంపవలసిందిగా తెలుగు మహిళా లోకానికి విజ్ఞప్తి చేస్తున్నాము.

—ఎడిటర్

'వనితాజ్యోతి'